క్లుప్తంగా

గంగమ్మకు ప్రత్యేక పొంగళ్లు



చిల్లకూరు : మండలంలోని గొల్లపాళెంలో వెలసిన గంగమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయాన్ని నిర్మించి 40 రోజులు పూర్తయిన సందర్భంగా మండల పూజ చేపట్టారు. మహిళలు ఉదయం చద్దిపోసి బోనాలు సమర్పించారు. అనంతరం పెద్ద గొల్ల అమ్మవారి ఆలయం ముందు పూజలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు కాటూరు శ్రీహరి, చంద్రశేఖర్, పిల్లెల సురేష్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.20 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణం



ఓజిలి: మండలంలోని వజ్జవారిపాళెం దళితవాడలో రూ.20 లక్షలతో సీసీరోడ్డును నిర్మించారు. కాలనీలో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉండి వర్షాకాలంతో బురదమయంగా మారడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని నేతలు తిరుపతి ఎంపీ గురుమూర్తికి విన్నవించారు. స్పందించిన ఆయన రూ.20 లక్షలు మంజూరు చేశారు. దీంతో సీసీరోడ్డు నిర్మాణం పూర్తిచేశారు. కాలనీవాసులు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

గాయపడిన వృద్ధురాలు మృతి

కోట : కోట బజారువీధిలోని దాదరాయిగుంట సమీపంలో శనివారం రాత్రి గాయపడిన గుర్తు తెలియని వృద్ధురాలు చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. ఆమె గాయపడి రోడ్డు పక్కన పడి ఉండడాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఆమెను 108 వాహనంలో కోట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో గూడూరు ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఆమె మృతిచెందారు. ఆమె వివరాలు తెలియలేదని, సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా ప్రభుత్వ భవనాలు



పోలిరెడ్డిపాళెం గ్రామ సచివాయం, ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు

దొరవారిసత్రం : ప్రజల వద్దకే ప్రతి సేవా అందించాలన్న తలంపుతో జగనన్న ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే అన్ని సదుపాయాలతో భవనాలు నిర్మించారు. పోలిరెడ్డిపాళెం గ్రామ పరిధిలో రూ.45 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.20 లక్షలతో వైఎస్సార్ ఆర్బీకే, రూ.18 లక్షలతో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు నిర్మించారు. ఈ భవనాల సముదాయం వద్దనే రూ.3 లక్షలతో సామూహిక మరుగుదొడ్లు నిర్మించారు. ఇవి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి.

గిరిజన సంఘం జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా చెన్నకేశవులు

వెంకటగిరి రూరల్ : ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ సంఘం జేఏసీ తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా వెంకటగిరికి చెందిన గజ్జల చెన్నకేశవులు నియమితులయ్యారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు పాలకీర్తి రవికి కృతజ్ఞతలు తెలిపారు. గిరిజనుల సంక్షేమానికి తనవంతు కృషిచేస్తానన్నారు.

సంక్షేమ పథకాల అమలు జగన్‌కే సాధ్యం



కార్యక్రమానికి హాజరైన నాయకులు, ప్రజలు



తడ: పింఛను మొత్తం అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

- కొత్త పింఛన్ల పంపిణీ
- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

తడ: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను క్యాలెండర్ ప్రకారం అమలు చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. ఆయన ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో పెంచిన రూ.3 వేల పింఛను నగదులోపాటు కొత్తగా మంజూరైన 56 మందికి పింఛను నగదు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో పింఛను కావాలన్నా, నగదు తీసుకోవాలన్నా అవ్వాతాతలకు నరకం కనిపించేదన్నారు. జన్మభూమి కమిటీ సభ్యుల దయాదాక్షిణ్యాలు ఉంటేనే పథకాలు మంజూరయ్యేవని తెలిపారు. ప్రతి నెలా పింఛను తీసుకునేందుకు ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు పడాల్సి వచ్చేదని పేర్కొన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు 600 హామీలు ఇచ్చి నెరవేర్చలేదని ఆరోపించారు. మేనిఫెస్టోను వెబ్‌సైట్ నుంచి తొలగించిన ఘనత చంద్రబాబుదన్నారు.

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టో అంటే పవిత్ర గ్రంథమని చాటి చెప్పారని వివరించారు. అబద్ధపు హామీలతో మోసపోయిన అక్క, చెల్లెమ్మలను ఆదుకునేందుకు ఆసరా, చేయూత వంటి పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. అనంతరం స్థానికులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆమోసుబాబు, ఎంపీపీ కె.రఘురెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కె.ఆర్ముగం, జేసీఎస్ మండల కన్వీనర్ ఆర్‌కే సుందర్‌రెడ్డి, నాయకులు నాగరాజారెడ్డి, క్రిష్టారెడ్డి, మునీష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కోదండం, తిరుమలైరెడ్డి, వాసుమొదలి, మురుగన్‌రెడ్డి, నందారెడ్డి, శశికుమార్, రాజ్‌కుమార్, రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి మళ్లీ పట్టం కట్టాలి

సూళ్లూరుపేట రూరల్ : మాట తప్పని నేత, సంక్షేమ సారథి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ పట్టం కట్టాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కోరారు. సూళ్లూరుపేట మున్సిపాలిటీలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం రూ.3 వేలు పెన్షన్ కానుక పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో 3,698 వేల మంది లబ్ధిదారులకు రూ.1.16 కోట్లు ఇస్తున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రూ.1000 పింఛను మంజూరుకావాలంటే జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ప్రతినెలా పింఛను నగదు తీసుకునేందుకు ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రభుత్వ కార్యాలయం వద్ద పడిగాలుకాయాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం అర్హత ఉంటే పింఛను మంజూరవుతోందని, ప్రతినెలా ఇంటి వద్దకే వచ్చి పింఛను నగదు అందజేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు చిన్ని సత్యనారాయణ, పోలూరు పద్మ, కౌన్సిలర్లు మీజూరు రామకృష్ణ, విజయలక్ష్మి, సౌజన్య, కృష్ణ బలిజపూసల బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ తుపాకుల ప్రసాద్, ఆయితా శ్రీధర్ పాల్గొన్నారు.



లబ్ధిదారులకు రూ.3 వేలు పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

శ్రీరాముని అక్షింతల ఊరేగింపు



రాపూరు : అయోధ్యలో శ్రీరామునికి పూజ చేసిన అక్షింతలు ఆదివారం రాపూరుకు చేరుకున్నాయి. రాపూరులోని శ్రీరామ మందిరం నుంచి అయ్యప్ప స్వామి, మహావిష్ణువు ఆలయం వరకు అక్షింతలను ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రజలకు పంపిణీ చేసినట్టు విశ్వహిందూ పరిషత్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు మనోహర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నారాయణ, శివకుమార్, గణపతి, ఆనంద్‌రెడ్డి, తిలక్‌రెడ్డి, పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పారా అథ్లెటిక్స్‌కు అన్వేష్



గూడూరు రూరల్ : గోవాలో ఈ నెల 9న సగ్ అథ్లెటిక్స్ స్టేడియంలో ఇంటర్నేషనల్ పర్పుల్ ఆధ్వర్యంలో జరగనున్న 22వ నేషనల్ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్–2024 పోటీలకు గూడూరుకు చెందిన దివ్యాంగుడు అన్వేష్ ఎంపికయ్యాడు. అన్వేష్ ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఏపీ నుంచి 46 మంది ఎంపిక కాగా అందులో తాను కూడా ఉన్నట్టు తెలిపాడు. తాను షాట్‌పుట్, జావెలిన్ త్రో ఎఫ్–46 కేటగిరీల్లో ఆడనున్నట్లు తెలిపారు. అతన్ని పలువురు క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

ఎవరెన్ని కుట్రలు చేసినా జగనే మళ్లీ సీఎం

- జగన్ కోసం 20న సుదర్శన యాగం, రుద్రాభిషేకం
- ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోట : ఎవరెన్ని కుట్రలు చేసినా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఏమీ చేయలేరని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం కోటకు వచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో రెండవసారి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతిహామీని నెరవేర్చారన్నారు. రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్టు తెలిపారు. చంద్రబాబు మరోసారి నీచరాజకీయాలకు తెరతీస్తున్నారని, పవన్ కల్యాణ్ రూ.500 కోట్లకు అమ్ముడుపోయాడన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ విజయఢంకా మోగించి తిరిగి ముఖ్యమంత్రి కావాలని కోరుతూ ఈ నెల 20న కొడవలూరు మండలం రాజుపాళెంలో శ్రీనారికేళ సహిత రసలింగేశ్వర స్వామి ఆలయంలో లక్ష కొబ్బరి కాయలు, లక్ష రుద్రాక్షలు, లక్ష బిల్వార్చన, లక్ష కుంకుమార్చనతో పాటు మహారుద్రాభిషేకం, సుదర్శన యాగం చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వీరిచలపతి, నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, కోటమ్మ ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ నరమాల రమణయ్య, సర్పంచ్ వెంకటరమణమ్మ, ఎంపీటీసీ మొబీన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



కోటమ్మ ఆలయం వద్ద ప్రసన్నకుమార్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

కోటమ్మకు ఎమ్మెల్యే ప్రసన్న పూజలు

కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదివారం తన స్వగ్రామం కోటలో పర్యటించారు. గ్రామదేవత కోటమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.7 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ప్రసన్నకుమార్‌రెడ్డి మనవరాలు తలనీలాలు సమర్పించే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తమ పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాన్ని పాటించి మనవరాలి తలనీలాలు సమర్పించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, నల్లపరెడ్డి రజత్ కుమార్‌రెడ్డి, అల్లం రమణయ్య పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.5 లక్షల విరాళం



ఈవోకు రూ.3 లక్షలు ఇస్తున్న మాల కొండయ్య, మాగంటి పెంచల శ్రీనిక్, పెంచల శ్రీయాన్



నాయుడుపేట టౌన్: విరాళం అందజేస్తున్న దాతలు

రాపూరు/నాయుడుపేట టౌన్ : పెంచలకోన పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి నిత్యాన్నదాన పథకానికి నెల్లూరుకు చెందిన పెండ్యాల మాలకొండయ్య, మాగంటి పెంచల శ్రీనిక్, మాగంటి పెంచల శ్రీయాన్ రూ.3,03,333 విరాళం ఇచ్చినట్టు ఈవో జనార్ధన్‌రెడ్డి తెలిపారు. అలాగే ఉయ్యూరుకు చెందిన బొల్లినేని నవీన్ రూ.2,00,016 ఇచ్చారని పేర్కొన్నారు. అదేవిధంగా నాయుడు పేట మండలం కోనేటి రాజు పాళెం గ్రామానికి చెందిన ముప్పాళ్ల సోదరులు ఆదివారం వారి తల్లిదండ్రులు ముప్పాళ్ల జయరాయ రాజు, సంపూర్ణమ్మ జ్ఞాపకార్థం రూ.2 లక్షల విరాళం ఇచ్చారు. ముప్పాళ్ల రవీంద్రరాజు, శేఖర్ రాజు, చంద్రశేఖర్ రాజు, అర్జున్ రాజు, మురళిరాజును ఆలయ అధికారులు అభినందించి స్వామి వారి ప్రత్యేక దర్శనం కల్పించారు.



విరాళం ఇస్తున్న బొల్లినేని నవీన్

కండలేరులో 12.914 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 12.914 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగకు 40 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 110 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సీఎం జగనన్నతోనే అన్ని వర్గాల అభ్యున్నతి



రావి దేవికా చౌదరి

బాలాయపల్లి (డక్కిలి) : సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాల ప్రజలకు లబ్ధికలుగుతోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధికారి ప్రతినిధి రావి దేవికా చౌదరి తెలిపారు. ఆమె ఆదివారం బాలాయపల్లిలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 5న వెంకటగిరిలో వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సామాజిక సాధికార బస్సుయాత్ర విజయవంతం చేయడంపై వెంకటగిరి, డక్కిలి, రాపూరు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో చేనేత కార్మికుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించారని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వంలోనూ గుర్తింపు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఇంటింటికీ తిరిగి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీదేనని చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పేదల సంక్షేమం కోసం చేసింది ఏమీ లేదన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

పెళ్లకూరు : నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారిపై దిగువ చావలి గ్రామం వద్ద ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని బిట్రగుంట జనార్ధన్‌రాజు(70) మృతి చెందాడు. శిరసనంబేడు రాజుపాళెం గ్రామానికి చెందిన జనార్ధన్ రాజుకు కొంత కాలంగా మతిస్థిమితం లేదు. ఈక్రమంలో దిగువ చావలి వద్ద రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుతుండగా ప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ శ్రీకాంత్ అక్కడికి చేరుకుని మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అట్టహాసంగా క్రీడా పోటీలు ప్రారంభం



పరుగు పందెంలో క్రీడాకారులు

వెంకటగిరి రూరల్ : మండలంలోని వల్లివేడు సమీపంలో ఉన్న 9వ బెటాలియన్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఆదివారం సంవత్సర క్రీడా పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. బెటాలియన్ కమాండెంట్ పి.ప్రకాష్ ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. 800 మీటర్ల ఫైనల్ రన్, జావలిన్‌త్రో, డిస్కస్‌త్రో, వాలీబాల్, హై జంప్, లాంగ్ జంప్ పోటీలు జరిగాయి. అనంతరం విజేతలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో అసిసెంట్ కమాండెంట్ ఎంఎల్ మనోహర్, ఆనంద్ కన్నా, బెటాలియన్ అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో బంగారు భవిష్యత్తు

ఓజిలి : క్రీడలతో బంగారు భవిష్యత్తు పొందవచ్చని జెడ్పీటీసీ గుంటమడుగు రవీంద్రరాజు తెలిపారు. ఆడుదాం ఆంధ్రా ముగింపు పోటీల్లో భాగంగా ఆదివారం ఆర్మేనిపాడు ఉన్నత పాఠశాలలో క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. పది సచివాలయాల పరిధిలో గెలుపొందిన క్రీడాకారులకు ఫైనల్‌లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నికాయిట్, ఫుట్‌బాల్ తదితర క్రీడలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. జెడ్పీటీసీ రవీంద్రరాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలకు తగిన ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. సచివాలయ పరిధిలో గెలుపొందిన క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రఘురామరాజు, ఉప సర్పంచ్ సుకుమార్‌రాజు, నేతలు వెంకటసుబ్బరాజు, వామనరాజు, హెచ్ఎం వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు పీ పెద్ద మస్తానయ్య, భూదేవి, వెల్ఫేర్ అసిస్టెంట్ రమేష్ పాల్గొన్నారు.



క్రీడాకారులకు దుస్తులు అందజేస్తున్న జెడ్పీటీసీ రవీంద్రరాజు